6

ఛాయలు

త్రొమ్మిదయింది. సెంట్రల్ రైల్వేస్టేషన్ మెర్క్యూరీ లైట్లకాంతిలో చాలా అందంగా కనపడాలని ప్రయత్నిస్తోంది కాని, నాలుగడుగుల నుంచి ఐదుమువ్పావడుగులలోగా అనేక రకాల పొడుగులతో చెదిరిపోయిన పుట్టలోని కండచీమల్లాగ ఇటూ అటూ కంగారుగా తిరుగుతున్నారు మనుష్యులు. కొంతమంది లావాటివాళ్లు ఓ మాదిరి పెద్ద సైజు ఉండల్లాగ దొర్లిపోతున్నారు. సన్నగా, పొడుగ్గా చారల సూటేసు కున్నవాళ్ళు గజంబద్ద మింగేసినట్టు నడుస్తూ, వున్న కీవంతా పారబోసేస్తున్నారు. పైన ఎగిరే పురుగులు మిగిలి, కింద నుండే మనుష్యులు లేకపోతే స్టేషను చాలా బాగుండేది.

స్టేషను హాలులో అడుగు పెట్టగానే సుబ్రహ్మణ్యం తో వుండే కవికి కనబడిన స్టేషనుతీరు ఇది.

సుబ్రహ్మణ్యం చీదరించుకున్నాడు కవినిచూసి "ఏమి టోయి! మన తలకాయ! మా తమ్ముడు పారిపోయాడని నేనేడుస్తుంటే నీ కవిత్వం ఏమిటిమధ్య? బొత్తిగా సమయం సందర్భంలేవు నీకు" మనసినిమాల్లో 'మనస్సు' బయటకొచ్చి తనతాలూకు ఆసామీతో మంచీ చెడ్డా మాట్లాడినట్లు, తనలో వుండే కవివుత్పత్తి శరీరంతో ఎదురుగా వుంటే, సుబ్ర

హ్మణ్యం 'ఏమిటోయ్ మన తలకాయ' అంటూ మొదలెట్టి. ''...సందర్భం లేదు నీకు'' అంటూ ముగించి, చీవాట్లు పెట్టి వుండును.

పదినిమిషాలపాటు ఓప్రక్కగానుంచుని, వెళ్ళిపోతున్న జనాన్ని జాగర్తగా చూశాడు తమ్ముడు దొరుకుతాడేమోనని. ఇంచుమించు తొమ్మిదింబావుకి అంతా ఖాళీఅయిపోయింది. ఈమాటు కవి ఖాళీఐన సెంట్రల్‌ని వర్ణించడానికి ప్రయత్నించబోయాడు. సుబ్రహ్మణ్యానికి కొంచెం కోపంవచ్చింది. కవినిచూచి పళ్ళు కొరుక్కుని అప్పుడే విరుచుకొన్న వేళ్ళని ఇంకొకమాటు (అవి చప్పుడు చెయ్యకపోయినా) కొంచెం నెప్పిపెట్టేలాగ విరుచుకొని, గట్టిగా ఊపిరిపీల్చి వేగంగావదలివేసి కథలకి సామాను ఏరే ఆశ వదిలేసి మామూలు సుబ్రహ్మణ్యం అయిపోయి వూరుకున్నాడు. ఊరుకోలేదు. వెంటనే తన పారిపోయిన తమ్ముణ్ణి వెతకటానికి నిశ్చయించుకొని, ఆ ప్రయత్నానికి ఉపక్రమించాడు.

వాడుగాని తనని ఏమూలనించైనా చూశాడా, కథ అడ్డంతిరిగినట్టే! ఇట్టేపారిపోతాడు. అక్కడనుంచి వాడివాళ దొరక్కపోయాడా, ఎత్తుకొచ్చిన పాతికరూపాయలూ తగలేసి కాని ఇంటికిరాడు. తను తెలివితేటలుపయోగించాలి. అన్ని పక్కలా ఒకేమాటు చూడగలగాలి...''పూర్వం ఇంద్రుడికి కామోసు వెయ్యి కళ్ళుండేవి...''

సుబ్రహ్మణ్యంతో కవి బయటికొచ్చాడు. ఈ కవి శుద్ధనాస్తికుడు.—దేవుళ్ళంటే బొత్తిగా నమ్మకంలేదు....

"ఆ 'వట్టి నాన్సెన్స' వెయ్యికళ్ళేమిటోయి. ఉత్త అప్సర్డ్ ...ఇంపాసిబుల్...అబ్ నార్మల్'' అంటూ అరచి నోరు మూసుకున్నాడు.

సుబ్రహ్మణ్యం విసుకున్నాడు. తను కాస్త దేముడి మీద గురి కుదుర్చుకుంటున్నాడు. ఇంకొంచెం వుంటే ఆ ఆర్తత్రాణపరాయణుడు ఏదో సాయం చేసునేమో. ఇంతలో ఈ నాస్తిక కవి అడ్డొచ్చి వ్యవహారం చెడగొట్టాడు. ఈ రంధి ఇలా సాగుతూవుంటే ఈ సందట్లో తమ్ముడు ఏప్రక్కనుంచో వుడాయించేస్తాడు. తొమ్మిదీ పదిహేడునిమిషాలకి రంధి పూర్తి అయింది....

సుబ్రహ్మణ్యం చాలా ఇంగ్లీషుసినిమాలు చూశాడు. అమెరికానుంచి వచ్చే క్రైమ్ పిక్చర్లు జ్ఞాపకంవచ్చాయి. అక్కడ డిటెక్టివ్‌ల తెలివితేటల్ని తలదన్నే నేర్పుతో దొంగలు తిరుగుతారు. దొంగల నేర్పుని మించి వీళ్ళుతిరుగుతారు. అది ఒక కళ. ఆ కళలో అమెరికన్లు మనని తరిఫీదు చేస్తున్నారు. క్రైమ్ పిక్చర్ల ద్వారా ఇంగ్లీషుసినిమాలకి ఖర్చుపెట్టిన డబ్బులు దండుగ కాదనిపించింది సుబ్రహ్మణ్యానికి.

డిటెక్టివ్ సుబ్రహ్మణ్యం బుఱ్ఱ వేడిగా పనిచేసింది. సెంట్రల్ హాల్లోంచి మహావేగంతో పక్కనున్న చిన్న హాల్లోకి ప్రవేశించాడు. అదొక వసారాలా ఉంది. అక్కడే టిక్కెట్లు అమ్ముతారు. అక్కడున్న బెంచీలమీద పనిలేని వాళ్ళు, ఇళ్ళులేనివాళ్ళు, ఇల్లువుండి పనిలేని ఇతర బాపతులవాళ్ళూ కూర్చున్నారు. బీడీదమ్ములు లాగుతూ కునికిపాట్లు

పడుతున్నారు. పావునిమిషంలో క్షుణ్ణంగా వెతికేసి తమ్ముడు తప్ప తక్కినవాళ్ళందరూ ఉన్నారని అనుకుంటూనే వరండా చివరకి చకచక నడుస్తున్నాడు. లోపల కవి కదిలాడు. "ఈ పనిలేని అనాథులూ, అభాగ్యులూ అయిన భారతీయులు ..." సుబ్రహ్మణ్యం వినలేదు. తనసంగతి ఏదో తేలలేదు; ఇంక భారతీయుల గొడవెందుకో పైగా?

వరండాచివరికి చేరగానే కాంపౌండు అంతా కలియ చూశాడు. వరండా రెండోచివర కాంటీన్ వుంది. అక్కడ తన తమ్ముడుగాని టిఫిన్ పుచ్చుకుంటున్నాడేమో!... "టిఫిన్‌కి తెలుగు అల్పాహారం" అన్నాడు కవి. "హుఁ" అంటూ నిట్టూర్చాడు సుబ్రహ్మణ్యం.

ఈమాటు సెంట్రల్‌హాలు పూర్తిగా చూడాలి. అప్పటికీ తమ్ముడు కనబడకపోతే పోలీసు రిపోర్టు ఇస్తాడు సుబ్రహ్మణ్యం. అతనికి చాలా మంచిదీ, సిసలైనదీ అయిన ఇంగ్లీషుభాష 'యాంకీ స్టయిల్' లో ధారాళంగా మాట్లాడే సత్తా వుంది.

ఆఖరిమాటు వరండా కలియజూచాడు. కవి మెదిలాడు. "ఈ పనిలేని అనాథులూ, అభాగ్యులూ అయిన భారతీయులు తిన తిండీ, నిలువనీడా, కట్టుకోడానికి..." సుబ్రహ్మణ్యాని కేడుపొచ్చింది. బాధ, ఆవేదన, జాలి, దైన్యతలతో నిండి పొంగి పొర్లిపోయే చూపులతో కవిని చూశాడు. "నువ్వు దయచేసి ఊరుకుంటే బయటికెళ్ళాక సిగరెట్టు కాల్చుకుందాం." అని ఆశపెట్టుతూ.

సెంట్రల్‌లో హాల్లోకి ప్రవేశించి ఐదడుగులు వేసే లోగా తమ్ముడక్కడ లేడనే నిర్ధారణ కొచ్చాడు. అంతా ఖాళీగా వుంది— అక్కడక్కడ ఓ పోర్టరు, ఒక ఆంగ్లో ఇండియన్ లేడీ, బరువు తూచుకునే మిషన్‌లోకి తొంగి చూస్తున్న ఒక భారతీయ కార్మికుడూ తప్ప...తన తమ్ముడు మాత్రం లేడు. 'వాడొక్కడూవుండి ఈ వెధవలందరూ లేకపోతేనేం' అనుకుంటూ పైనుంచి వేళ్లాడే పెద్ద గడి యారంలో 9 గంటలా 18 నిమిషాల టైముచూసి, ఆంగ్లో ఇండియన్ అమ్మాయి వలపులు బాగా పరిశీలించబోయాడు. పరిశీలించును కాని, కవి ఊరుకోటంలేదు. పోర్టరుగాథ, కార్మికుడిబాధ ఏకరువుపెట్టి గేయం కట్టబోయాడు. గేయం కట్టేవాడేకాని సుబ్రహ్మణ్యం తనతమ్ముడినిగురించి ఆలోచించ బోయాడు. ఆలోచించునుగాని, 'డేయ్' (అంటే తెలుగులో ఒరేయ్) అని ఎవడో ఎవణ్ణో పిల్చాడు.

సుబ్రహ్మణ్యం "ప్" అని పెదిమలు, నాలిక, పళ్ళూ బలవంతానా విడిదీసి, చిన్న చప్పుడు చేసుకున్నాడు. "ఒరేయ్! అని పిల్చుకోడం ఇద్దరు మనుష్యుల స్నేహం లోని దగ్గరదనాన్ని చూపుతుంది కామోసు ... బాగా స్నేహంవున్న జంతువులు ఏమని పిల్చుకుంటాయో!" వెంటనే సుబ్రహ్మణ్యం ఆలోచన భగవంతుడి సృష్టి వైచిత్ర్యం మీదికి పోయింది.

"డేయ్! వున్నె దాండా" (ఒరేయ్ నిన్నేరా) సుబ్రహ్మణ్యం త్రుళ్ళిపడ్డాడు. ఎందుకంటే, కేక తన వెనుక

నుంచి వస్తోంది. తన ముందు పోయేవాళ్ళెవరూ లేరు. అర్థం కాని కుతూహలంతో వెనక్కి తిరిగాడు.

"ఓరేయ్! నిన్నేరా ఇలా రారా!" గుండె గతుక్కుమంది. తన కవిహృదయం ఈ అనుకోని అనుమానంతో దెబ్బతింది. ఎందుకంటే, ఆ అరిచేవాడు పిలిచేది తననే. వాడు చూస్తే ఓ రౌడీలా ఉన్నాడు—ఓ గూడ కట్టూ, చొక్కాపైన స్వెట్టరూ, నెత్తిమీద మఫ్లరుతో.

ఈ మాటుమాత్రం ఈ పనిలేని అనాథులూ, అభాగ్యులూ అయిన భారతీయులమీద కవికి కూడా సుబ్రహ్మణ్యానికొచ్చినంత కోపమూ వచ్చింది. వాళ్లకి బొత్తిగా మర్యాద తెలియదనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"థామస్ కోసం కదూ. నువ్వు వెతికేది?"

సుబ్రహ్మణ్యం నవ్వాడు. ఆ నవ్వు వెనకాల చాలా బాగుంది—వీ డెవడో తనని తెలిసున్నవాడిలా వచ్చేసి థామస్ గీమస్ అంటూ ఏదో చెప్పి తనని దబాయించి డబ్బులు కొట్టెయ్యడానికి చూస్తున్నాడు. సుబ్రహ్మణ్యం ఆలోచించాడు. మనసులో తోచిన అభిప్రాయాల్ని ఆలోచించకుండా బయటపెడితే పర్యవసానం చాలా భయంకరంగా ఉంటుంది. తన ఎదురుగా నిలుచున్నవాడు చూస్తే మొండిరకం రౌడీలావున్నాడు. పదితిన్నా ఒకటి కొట్టగలడు. తనేమో పది తినాలేడు; ఒకటి కొట్టాలేడు. సుబ్రహ్మణ్యానికి జబ్బపుష్టి లేనివాళ్లందరిమీదా హఠాత్తుగా జాలేసింది. వాళ్లెంత తెలివున్న వాళ్ళయితే నేమి? పలుకుబడి,

కీర్తి, డబ్బు ఉన్నవాళ్లయితేనేమి; ఇలాటి సమయంలో తన ఎదురుగా వున్న రౌడీవెధవముందర పనికిరారు.

ఈ రౌడీ, తన నిలా అవమానించి పిల్చి ఇలాటి ప్రశ్న లడగటంలో వాడి అంతరంమీద తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడంటే వాడు మరుక్షణంలో తనని మహా అవమానం చేసెయ్యొచ్చు-అంటే కొంచెం చెయ్యి తొందరపడి చెంపకాయ వెయ్యొచ్చు. అంచేత, తనకు ఎంతకోపం వచ్చినా దాన్ని అణచుకుని ఓ చిన్న అర్థంకాని నవ్వుతో దాన్ని కప్పెట్టి తనని సమర్థించుకునే లాగా, ఎదుటివాడిని చాలా మర్యాదగా అణచేలాగా తన మొగతనం చూపుకునే లాగా మాట్లాడడానికి సిద్ధమయ్యాడు.

"ఏమిటయ్యా! అలా మాట్లాడతావు? థామస్ ఎవడో నాకేం తెల్సు? వాడికోసం నేరావడ మేమిటి? నేను మైలాపూరు నుంచి వచ్చా"—తమ్ముడుకోసం వెతుకుతున్నానంటే అదేం హానో అని అది చెప్పలేదు.

"ఆఁ? మైలాపూరునుంచా? ...మీా ఎడ్రెసు?"

సుబ్రహ్మణ్యం ధైర్యంగా ఎడ్రసు చెప్పాడు. అంతే కాదు. ఈ దెబ్బతో వాణ్ణి ఇంప్రెస్ చేసిపారెయ్యాలి. తాను చదివే క్లాసూ, కాలేజీ పేరూ కూడా చెప్పాడు. చెప్పి ఈ మాటు వాడికేసి మహాధీమాగా చూశాడు. కాని వాడు మాత్రం అణుమాత్రంకూడా చలించినట్లు కనబడలేదు. నమ్మలేదేమో. పైగా వాడి "ఒరేయ్" అనే సంబోధన ఏ మాత్రంమారలేదు. ఇంతలోకే పోర్టర్ వచ్చాడు. ఈ

మాటు సుబ్రహ్మణ్యంలో ఎక్కడలేని ధైర్యం ఉద్భవించింది. ఇప్పుడు తనేం వాగినా ఈ రౌడీ చెయ్యి చొరవ చూపలేడు. ఎందుకంటే, ఇప్పుడు తమదగ్గర ఓ పెద్దమనిషి ఉన్నాడాయె.

ఇంకో ఇంకో సమయంలో పోర్టరు మామూలు పోర్టరులాగే కనబడతాడు. తను వాడికేసి చూడ్డానికి కూడా లెక్కచెయ్యడు. పైగాఎప్పుడేనా తన సామాన్లు మొయ్యటానికి అలాంటి పోర్టర్ని పిలిచినా, నా మీద తను అధికారం చెలాయించగలడు. దమాయించగలడు. కూలిడబ్బులికి ఏడిపించి, వాడిచేత "సామీ" అనీ "సార్" అనీ అనిపించుకొని, తర్వాత కొంచెం జాలి కూడా ఒలకపోసి, వాడికో అర్ధణా ఎక్కువిచ్చి, తను మహాపెద్దమనిషిలా పోజు పెట్టగలడుకూడా, అంతగా కావలసివస్తే. కూలీలు కూడా "తోటి మానవులే; మనకి సోదరులే" అని ఒప్పుకొని, వీళ్ల తరపున గేయం రాసి "అయ్యయ్యో! ఈ ఇలలో, అందరి గుండెలు శిలలో!" అని ఆనందించి వుండును.

కాని ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి; ఆ పోర్టరే ఇప్పుడు పెద్దమనిషి హోదాలో ఉన్నాడు. ఓ రౌడీలాంటి వెధవ, తనని రౌడీ అనుకుని దబాయించి, అవమానించి తన్నబోయే సమయంలో ఈ పోర్టరు న్యాయం చెప్పి, ఈ రౌడీవెధవ పొగరణచగల పెద్దమనిషయ్యాడు.

సుబ్రహ్మణ్యం నిస్సందేహంగానూ, ధారాళంగానూ ఆ పెద్దమనిషి హోదాలో వున్న పోర్టరుతో ఏకరువు పెట్టాడు—తనెవరో, ఎక్కడినుండొచ్చాడో, ఎందు

కొచ్చాడో, మధ్యలో ఈ రౌడీలాటి 'ఆయన' (పైకి వెధవంటే ప్రమాదం!) తనని ఎలా డబాయిస్తున్నాడో చెప్పి, న్యాయం అడిగినట్టు చూచాడు...

పోర్టరు ఒక పెద్ద వేదాంతిలా మొహం పెట్టాడు. సుబ్రహ్మణ్యంతో కవి, పోర్టరు 'సైకాలజీ' ఎనలైజ్ చేసును గాని, ఆ పోర్టరు ఈలోగానే చిరునవ్వుతో తల వూపి, చిన్న కెరటంలా వెళ్ళిపోతున్నాడు. సుబ్రహ్మణ్యం నిరాశతో కూలిపోయి వాణ్ణి తిట్టుకుందుకు సిద్ధమయ్యాడు. కాని ఈ లోగానే రౌడీవెధవ దిగ్విజయం చేసొచ్చిన చక్రవర్తిలా నవ్వుతూ ఉపన్యాసధోరణిలో మాట్లాడాడు.

"ఓ శేయ్! జాగ్రత్త, చెబుతున్నా. రౌడీలాగవచ్చి రాత్రి తొమ్మిది గంటలకి కొంప మునిగిపోయినట్లు సెంట్రల్ అంతా పరవళ్ళు తొక్కుతూ, అనుమానం పుట్టించేటట్టు తిరిగితే పోలీసు లేమనుకోవాలిరా?...నువ్వు దొంగతనం చేశావో, ఖూనీచేసావో, ఎవడికి తెల్సు? ఇంటికెళ్లు... నువ్వు చెప్పిన ఎడ్రసుకు వచ్చి చూస్తా తర్వాత. ఆ పైన నీ పని చెప్తా. ఊఁ నడు!" అని.

సుబ్రహ్మణ్యం అమాంతంగా తన గూడకట్టూ, స్టయిలిష్‌గా మడత పెట్టిన పొడుగుచేతుల-చొక్కా, కాలర్ క్రింద జేబురుమాలు, తన హైరాడ్డు క్రాఫూ పూర్తిగా జ్ఞాపకం చేసుకుని, కొంతసేపు తను రౌడీ అనుకున్నవాడు సి. ఐ. డి. అని ఊహించి నెలాఖరురోజుల్లో ఎలాగో ఓలాగు కేసులు పట్టాలని చూసే పోలీసు కళ్లలో, తను అప్పుడు వేసు

కున్న బట్టల్లో తన కెంత కల్చర్ ఉన్నా, తెలివి తేటలున్నా, తను ఎటువంటి పోకిరీవా డనబడడానికి అవకాశాలున్నాయో ఊహించుకుని ఆ కారణాలవల్ల వాడు తనకి అప్పుడు చేసిన మర్యాద బహుశా సమంజసమేమో అనే నిర్ధారణకి వచ్చే సరికి స్టేషన్ వదలి ట్రామ్‌రోడ్డుదాటి బస్సుస్టాండులో ఒణుకు తున్న కాళ్ళతో, ద్రుతంగా కొట్టుకునే గుండెల్తో, బెదిరే చూపుల్తో నిల్చున్నట్లు తెల్సుకున్నాడు. టైము తొమ్మిది గంటల ఇరవై నిమిషా లయింది.

మైలాపూరు ట్రాములు అయిపోయాయిట. ఇక బస్సులు మాత్రమేట. వాటికీ రద్దీగానే ఉంది.

సుబ్రహ్మణ్యానికి మంచి దూరాలోచన వుంది.

తనకి బస్సులో చోటు దొరికేసరికి ఆలస్యం అవొచ్చు. రద్దీతో తోసుకుంటూ ఎక్కితే, ఇందాక తన్ను రౌడీ అనుకున్న పోలీసు గాని తన్ను చూస్తే పిక్‌పాకెట్‌కి ప్రయత్నాలు చేస్తున్నానని పట్టుకొని కసితీరా రెండు తగిలించొచ్చు. లేదా తను చోటు దొరికేదాకా వెయిట్ చేశాడా, "ఇక్కడే కాసుకున్నావుట్రా! థామస్ కోసం. దొంగవె..." అని మళ్ళా వ్యవహారం మొదటికి తెచ్చి పోలీసువారి ఆఫీసులో నైట్‌డ్యూటీ వెయ్యొచ్చు.

అంచేత వాడు ఈ ఏర్పాట్లు చేయడానికి వచ్చేలోగా తను నడక సాగించి బ్రిడ్జి దాటిపోతే ఫరవాలేదు. జనం నడుస్తూనే వున్నారు.

సుబ్రహ్మణ్యాం నడుస్తున్నాడు. కాని బ్రిడ్జి ఎక్కిదిగే వరకూ కూడా తన వెనకాలేవచ్చి బాగా పొడుగ్గా అయిపోయి ఫేడవుటయిపోయే ప్రతినీడా ఇందాకటి పోలీసు వెధవదే అనుకున్నవాడై తల ప్రక్కలకి త్రిప్పడానికికూడా జంకుతున్నాడు.

ఇలాంటప్పుడు పాటపాడ్డం బెస్టుకాని, ఒకటీ మంచిది జ్ఞాపకంరాదు. ఒకటి వచ్చినా దాని వరస జ్ఞాపకం రావటంలే. అసలు ధ్వనే బయటకు రావటంలే.

పాట రాని సందర్భంలో ఈలవేస్తే బాగానే ఉంటుందని తోచివుండవచ్చు. నోరు ముందుకు పెట్టి ఈల వెయ్యబోయేంత పని చెయ్యబోయాడు. కాని, వెనకాల తరిమే నీడ పోలీసువాడి దయ్యంటే వాడు తన్ని, బహుశా అనుమానించి డబాయించవచ్చు. థామస్‌ని పిలిచేందుకు ఈ ఈల ఒక గుర్తని వెంటనే ఈలవేసే కార్యక్రమం పూర్తిగా ఉపసంహరించుకుని, ఏం చెయ్యాలో తోచని పరిస్థితిలోకి వచ్చేశాడు సుబ్రహ్మణ్యాం...

ఇంతలో "మిలియన్స్ యూజ్ ఇట్ డెయిలీ" అని భూగోళం బద్దలుగొట్టే ట్టరిచింది ఎదురుగుండా సబ్బు ఎడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డు. సుబ్రహ్మణ్యాం ఆగినవ్వాడో, నవ్వి ఆగాడో కాని, మొత్తానికి ఆగాడు. "అయితే, ఇంత పెద్ద అరుపులెందుకోయ్! మిగిలిన కొంచెంమందికోసం" అనుకొన్నాడు.

ఈలోగా, ఇందాకటినుంచీ తన వెనకాలే తరుముతున్న నీడతాలూకు ఆసామీ దాటిపోయాడు. ఇదే

సుబ్రహ్మణ్యం కోరింది. ఇందుకే అతను ఆగడం, నవ్వడం, విమర్శించడం - అన్నీని. తను 'రౌడీ' అనుకున్న పోలీసు వాడు తనను తరమటం లేదన్నమాట. ఈ మాటు వెనక్కి- ధైర్యంగా చూశాడు.

పది అడుగులు వేసేసరికి ధైర్యం ఎక్కు-వయింది. ఎందుకంటే తనకన్నా రౌడీల్లా కనబడే వాళ్ళంతా వస్తూ పోతూ వున్నారు. ఇప్పుడు గాని ఆ పోలీసువచ్చి డబాయించాడా, సుబ్రహ్మణ్యం చెయ్యబోయే మొదటిపని - వాణ్ణి ఈడ్చి లెంపకాయ కొట్టడమే.

సుబ్రహ్మణ్యం నడక సాగించాడు ముందుకి.

మనస్సు వెనక్కె-ళ్ళింది సెంట్రల్ కి......

తొమ్మిదిగంట లవుతూ వుంటుంది. సుబ్రహ్మణ్యం పారిపోయిన తమ్ముడికోసం గబగబా, కంగారుగా సెంట్రల్ లో పరవళ్ళు తొక్కు-తూంటాడు.

"డేయ్"

సుబ్రహ్మణ్యం వెంటనే వెనక్కి- తిరుగుతాడు.

"థామస్ కోసమేనా నువ్వు వెతికేది?"

సుబ్రహ్మణ్యం జవాబివ్వడు. పైగా తన్ని 'ఒరేయ్' అని పిలిచినవాణ్ణి ఎగాదిగా చూస్తాడు; "నీకేమన్నా ఒళ్లూ పై తెలుస్తోందా" అంటూ.

వాడు సుబ్రహ్మణ్యం చొక్కా- కాలర్ పట్టుకొని గుంజుతాడు, ఏదో అరవంలో వాగుతూ—

'ఠప్' మని లెంపకాయ కొడ్తాడు సుబ్రహ్మణ్యాం వాణ్ణి. వాడు పడిపోతూవుంటే, వాడి కాలర్ పట్టుకుని ఆపి, మళ్లా రిపబ్లిక్ సీరియల్స్‌లో హీరోలాగ గడ్డంకింద ఒక్క 'నాకౌట్' ఇస్తాడు. వాడు దూరంగావున్న స్తంభానికి కొట్టుకుని కిందపడ తాడు. ఎడా పెడా ఇంకో నాలుగువాయించి, జుట్టుసర్దుకుం టాడు సుబ్రహ్మణ్యాం. జనం గుంపుగా చేరి చూస్తూవుంటారు.

సుబ్రహ్మణ్యాం, తన కారుడ్రైవర్ని పిల్చి, అప్పుడే అక్కడికి కొచ్చిన పోలీసుకి వాణ్ణి చూపించి అవసరమైతే తన యింటికి రమ్మని చెప్పి రక్తంలో పడివున్న మొదటి పోలీసుని చూచి, తలాడించి కారు డ్రైవ్ చేసుకుని ఇంటికి పోతాడు.

ఉలిక్కి పడ్డాడు సుబ్రహ్మణ్యాం. సరిగ్గా అరక్షణం కిత్రితం భూతంలాంటి బస్సు తన్ని దూసుకు పోయింది. పెద్ద అరుపుతో రోడ్డు మధ్యనుంచి ప్లాట్‌ఫారంపైకి వచ్చాడు...

ఎలాగైనా మరీ ఇంత కఠినశిక్ష అనవసర మనిపిం చింది. తన్ని వాడెంత అవమానించినా తను అలా కొట్టి వుండకూడదు వాణ్ణి. సుబ్రహ్మణ్యానికి పోలీసువాడిమీద చాలా జాలేసింది......అబ్బే! ఈ శిక్ష బాగులే......

సినిమా ఎడ్వర్టయిజ్‌మెంట్ బండీ తోసే కుఱ్ఱాడు బండీ నోపక్కగా ఆపి, దాంట్లో దూరి కూర్చుని బీడీ కాలుస్తున్నాడు.

నవ్వొచ్చింది. ఈ కుఱ్ఱవెధవలు పగలూ ఇంతే. ఓ మూల ఆపేసి దాంటో పడుకుంటారు...అయినా థియేటర్ వాళ్లిచ్చే కూలికి చాలీ సేవ...

హఠాత్తుగా మిష్టర్ సుబ్రహ్మణ్యం దృష్టి ఆ బండి మీది పోస్టర్ మీదవున్న హీరోయిన్ బొమ్మమీద. ఇంకా కరెక్టుగా కావాలంటే ఆ బొమ్మలో వుద్రేకజనకంగా డిజైన్ చేసిన వక్షోజాలమీద పడింది. సుబ్రహ్మణ్యంలో కవి సినిమాలవారు సెక్సుని ఎంత ఘోరంగా ఎక్స్ప్లాయిట్ చేస్తున్నారో, ఎంత అవినీతిని రేపుతున్నారో ఆలోచించి విమర్శించునుగాని, క్షణంలో అతని శరీరం స్వాతంత్రం తీసుకుంది. నరాలు స్వాధీనం తప్పాయి, మనస్సు మత్తెక్కింది. ఒళ్లంతా ఒక్క తీయటి తలపుతో జలదరించి, వెంటనే బిగుసుకుపోయింది. దృష్టి కొంచెం మందగించింది. వెంటనే నోరు బిగించుకపోయి నాలుక బెరడుకట్టింది. గుండెలో ఒకశూలం గుచ్చుకుని ఆ తియ్యని నొప్పి ఒక కెరటంలా వెన్నెముక చివరకంటూ విరిగింది.

ఈ సరికి అతడు సరిగ్గా సినిమాపోస్టరు ప్రక్కనే నిలిచాడు. ఒక్కమాటుగా అతనిలోవున్న కామప్రవృత్తి ఉవ్వెత్తున మహోన్నత కెరటంలా లేచింది. సముద్రోద్భూత జ్వాలవలె ఒక అగ్ని ప్రజ్వరిల్లింది. కాని అది ఎంతటి చల్లటి మంట!...సుబ్రహ్మణ్యం ఇటూ అటూ చూశాడు. దగ్గర్లో ఎవరూ లేరు, బండి కుర్రాడు కునుకుతున్నాడు. వెంటనే అతను ఎడంచెయ్యి వేళ్ళు పోష్టర్ మీది బొమ్మ వక్షోజాల మీదుగా పోనిచ్చి చెయ్యి అలా బండి చివర వరకూ రాసుకుంటూనే నడిచాడు. మూడు క్షణాల్లో బండి దాటిపోయాడు. తుఫాను చల్లారింది ... ఈ కొత్త ప్రశాంతంలో అతను చల్లగా నడిచాడు......

రాత్రి పదకొండప్పుడు — అంటే రోడ్డుమీద జనం లేనప్పుడు అటూ ఇటూ ఎలెక్ట్రిక్ దీపాలు బధ్ధకంగా నిల్చుని మత్తుగా కిందకు చూస్తున్నాడు. ఇలాటిపిల్ల ఒంటరిగా ఎదురొస్తే...సుబ్రహ్మణ్యం గుటకలు మింగాడు... ఆ పిల్లని దగ్గరగా రానిచ్చి గబుక్కున కావలించుకుని గట్టిగా ముద్దెట్టుకుని తిరిగి హఠాత్తుగా వదిలేసి పరిగెత్తుకుని పోవచ్చు తను...ఆ! తన కా ధైర్యం వుంది. బహుశా ఇష్టంకూడా వుండొచ్చు. కాని, పైకి చేస్తే నలుగురూ చీవాట్లుకూడా వెయ్యొచ్చు. మామూలుగా మనిషైన ప్రతివాడూ అంతేనేమో. అధమం, అంతపనిచేసే ధైర్యం లేకపోయినా ఆ ఆలోచన తప్పకుండా వస్తుంది. కాని, నిజం ఒప్పుకోడు. ఒప్పుకుంటే వాడు వెధవ, పోకిరీ, రౌడీ.

తనిలాగ మహా 'సైకోఎనలిస్ట్' లాగా ప్రజా బాహుళ్యపు నైతిక విలువలు కొలవడం, ప్రజల మనస్తత్వపరిశీలనకు పూనుకోడం, అందులో ముఖ్యంగా ఇలాంటప్పుడు ఏమీ బాగా లేదనిపించింది. ఏదో కమ్మగా ఆలోచించుకుంటూ పోతే కాళ్ళనొప్పి తెలియదు ... అసలు—అంటే ఒక వేళ ఆవిధంగా ఒక అమ్మాయే అలాంటి సమయంలో ఎదురవడం తటస్థిస్తే......

వెంటనే ఇంకో ఆలోచనకూడా సుబ్రహ్మణ్యం బుర్రలో తటస్థించింది...అంతా కలిసొచ్చి, అమ్మాయి ఎదురొచ్చి, తను ధైర్యం చేయబోయే సమయంలో ఇందాకటి (స్టేషన్‌లో) పోలీసువాడు అక్కడ ప్రత్యక్షమవడం తటస్థిస్తే..."

"ఛీ 'రొమాన్స్' అంతా పాడైపోయిం" దనుకున్నాడు సుబ్రహ్మణ్యం. ఆ కోపంలో శ్మాష్డ్, డిస్ట్రాయిడ్, క్రష్డ్ అనే మూడు ఇంగ్లీషుపదాలు జ్ఞాపకం వొచ్చాయి. ఈమూడూ 'ఎమ్ఫాటికల్'గా తనలో తానే ఉచ్చరించుకున్నాడు. ఈ గొడవలో ఎదురుగాఉన్న 'కీప్ లెఫ్ట్' బోర్డుని పరాకుగా చదివేసి, ఆ ఆజ్ఞని మన్నిస్తూ మలుపు తిరిగాడు. మలుపు తిరుగుతూ తనుచేసిన పొరబాటు గ్రహించుకుని వెకిలిగా నవ్వుకున్నాడు. ఎవరైనా విన్నారేమో అని అటూ ఇటూ చూశాడు...

హిందూదినపత్రిక ఆఫీసుదగ్గరికి చేరుతూండగా పోలీసుకారు నలభై మైళ్ళ స్పీడులో పోతూంది సెంట్రల్ వేపు. అందులో సర్కిల్ గారూ, ఓపోలీసూ ఉన్నారు. సుబ్రహ్మణ్యం ఆగాడు- "హు! వీళ్ళమట్టుకు ఇంత వేగంగా పోవచ్చు గామోసు!"

సుబ్రహ్మణ్యం నడక ఇంటివేపు సాగించాడు. హఠాత్తుగా మనసు సెంట్రల్ కేసి వెళ్తున్న పోలీసుకారును అందుకుంది.

* * *

తొమ్మిదవుతుంది. మిస్టర్ సుబ్రహ్మణ్యం సెంట్రల్ స్టేషనులో పారిపోయిన తమ్మునికోసం హడావుడిగా వెతుకుతూ వుంటాడు.

"థామస్ కోసమేనా నువ్వు వెతికేది?" అని పోలీసురౌడీ దబాయిస్తాడు. సుబ్రహ్మణ్యం మర్యాదగా

మాట్లాడతాడు కాని, వాడుమాత్రం సుబ్రహ్మణ్యాం ఎడ్రసు తీసుకోనికూడా నమ్మక అవమానించి పొమ్మంటాడు.

మిష్టర్ సుబ్రహ్మణ్యాం అవమానించబడిన హృదయంతో ఇంటి కొస్తూంటాడు.

మౌంటురోడ్డులో పోలీసుకారు ఎదురై ఆగుతుంది. "హలో గుడ్ ఈవినింగ్ మిస్టర్ సుబ్రహ్మణ్యాం" అంటూ కారులోనుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టరు దిగుతాడు కాని, సుబ్రహ్మణ్యాం కొంచెం చిరాగ్గా మాట్లాడతాడు "ఏమిటి సార్, మీ పోలీసులకేమీ మర్యాద తెలియదు. నేనిందాకా సెంట్రల్‌కెళ్తే ఎవడో సి. ఐ. డి. తగులుకుని నన్ను రౌడీ అంటూ దబాయించాడు. బొత్తిగా అంత తేడా తెలియదండీ వాళ్లకి?"

సర్కిల్ చాలా ఆశ్చర్యపోతాడు. "మిమ్మల్నా సార్ వాడు రౌడీ అంటూ? పదండి సెంట్రల్‌కి, వాడిసంగతి కనుక్కుందాం."

సుబ్రహ్మణ్యమే కారు నడిపాడు. దారిలో తనోప్లాను చెప్పాడు సర్కిల్‌కి. అలాగైతే వాడిని "రెడ్ హేండెడ్"గా పట్టుకోవచ్చు. సుబ్రహ్మణ్యాం ప్లాను విని సర్కిల్ ఆశ్చర్యపడ్డాడు. అందుకు నిదర్శనం అతడు గట్టిగా 'వండర్‌ఫుల్, సుపెర్బ్, మార్వెలస్' అనే మూడూ, ఇంచుమించు అంతే అర్థం సూచించేవి ఇంకో రెండూ వెరశి మొత్తం ఐదు ఇంగ్లీషు మాటలు ఉపయోగించటమే.

కారాపి సుబ్రహ్మణ్యాం ఒక్కడూ ముందర వెళ్ళి హోల్లో ప్రవేశిస్తాడు.

(ఇక్కణ్ణించి జరగబోయేది సర్కిల్ దాక్కుని చూస్తాడన్నమాట.)

ఇందాకటి 'రౌడీ' మళ్లా వస్తాడు. సుబ్రహ్మణ్యం చొక్కా పట్టుకొని, "ఏరా మళ్లీ వచ్చావ్? నువ్వసలు వచ్చినపని వేరు. ఏదో అడ్రెసిచ్చి డబాయిస్తావూ? దొంగ వెధవా..."

సుబ్రమహ్మణ్యం హఠాత్తుగా వాడిచెయ్యి విసిరికొట్టే స్తాడు. పైగా యిలా అంటాడు—"ఏమిటోయ్, నాకిష్టంవచ్చి నన్నిమాట్లు నేను సెంట్రల్‌కి వస్తా, నువ్వేమిటి? వెధవ డబా యింపూ నువ్వూను...మీ సర్కిల్‌కి రిపోర్టు చేస్తా, జాగ్రత్త."

'రౌడీ' లేక సి. ఐ. డి. చిన్నసైజు విలన్‌లాగ నవ్వు తాడు. "ఏడిశావ్! నువ్వు రిపోర్టు ఇవ్వడం, సర్కిల్ నమ్మ టం...దిక్కున్నచోట చెప్పుకో. సర్కిల్ కాదు వాడి బాబుతో చెప్పుకో."

హఠాత్తుగా స్తంభం చీల్చుకొచ్చిన నరసింహావతారం లాగ సర్కిల్ స్తంభంచాటునుంచి బయటికొస్తాడు—"డేయ్ షణ్ముగం" అంటూ.

షణ్ముగం (సి. ఐ. డి.) వెనక్కు తిరిగి నీరుకారి పోతాడు. సుబ్రహ్మణ్యం గుండె ఆనందంతో బీటవేస్తుంది. ఒక్కమాటుగా షణ్ముగం, సుబ్రహ్మణ్యం ఇద్దరూ ఏదో చెప్పబోతారు. సర్కిల్ నవ్వుతూ "ఇంకే చెప్పనక్కర్లేదు— అంతా నేచూశాను. షణ్ముగం, నీ ఉద్యోగం నిలబడాలంటే నువ్వు ఏ పనేనా ఆలోచించి చెయ్యాలి. ఆయన రౌడీయో,

పెద్దమనిషో తెలుసుకోలేని నువ్వు 'సి. ఐ. డి.' పనికి పనికి రావు. నిన్ను రేపట్నుంచీ సస్పెండు చేస్తా."

షణ్ముగం కొయ్యబారిపోయి దీనంగా సుబ్రహ్మణ్యం కేసి చూసి క్షమార్పణ కోరుతాడు. తనదగ్గర సిద్ధంగావున్న కొద్దిపాటి మర్యాదవాంఛల్ని ఉపయోగించి.

సుబ్రహ్మణ్యం అమాంతం దయా స్వరూపుడు అయిపోయి, శిబిదధీచులను జ్ఞప్తికి తెచ్చుకొని, "పోన్లెండి. ఈ మాటు కొదిలెయ్యండి" అంటాడు సర్కిల్‌తో. "సరే, ఈయనే ఊరుకున్నారు కాబట్టి కాని..." అంటూ సర్కిల్ ఓ చూపు చూసి, "రండిసార్, మిమ్మల్ని ఇంటిదగ్గర వదిలేస్తాను" అంటూ సుబ్రహ్మణ్యాన్ని కారులో ఎక్కించుకు పోతాడు.

* * *

పెట్టగోల హడావుడికి సుబ్రహ్మణ్యం మనస్సు సెంట్రల్ నుంచి ఎగిరి వెనక్కొచ్చేసింది...

ఎదురుగా 'ఎల్ఫిన్‌స్టన్' హాలుదగ్గర పావలాఅర్ధణా టిక్కెట్టుదగ్గర పోలీసులు లాఠీచార్జి చేస్తున్నారు జనాన్ని అణచలేక. మళ్ళా కోపం వచ్చింది సుబ్రిహ్మణ్యానికి, పోలీసులమీద. ఇందాకా వాడిది ఊహలోకూడా క్షమించనిదంత తప్పనిపించింది. ఇంతసేపూ తన శత్రువుని శిక్షించింది తన ఊహాప్రపంచంలోనే అని గ్రహించుకుని, తన ఆశక్తతని తల్చుకునేసరికి అతనికి కంటనీరు తిరిగింది.

ఎదురుగాథియేటరు కప్పుమీద నుంచున్న 'రెండాల్ఫ్ స్కాట్' రెండు రివాల్వర్లు పట్టుకుని, అమోఘమైన పోజులో చూస్తున్నాడు కిందికి.

రూపాయి పావలా టిక్కెట్టుకొని సుబ్రహ్మణ్యం ఆ సినిమాకి వెళ్ళాడు తన పాత శత్రువుకు కొత్త శిక్ష ఎలా వెయ్యాలో సినిమా చూస్తూ ఆలోచిద్దామని. ఇంకో కారణం కూడా వుండొచ్చు. తన తమ్ముడిని వెతికేందుకు ఉపాయాలు ఆలోచించటానికి.....బహుశా ఇంకో ముఖ్య కారణమూ వుండొచ్చు. అతడది మీకూ నాకూ ఏనాటికీ చెప్పడు... తను పొందిన ఇన్ని అవమానాలకన్నా సెంట్రల్ స్టేషన్‌లో ఒకే ఒక క్షణంపాటు తను చూసి, తీక్ష్ణంగా చదువుకున్న ఆంగ్లోఇండియన్ అమ్మాయి వంపులు, రోడ్డుపక్కగా తను చూసిన పోస్టర్ హీరోయిన్ వంపులు అతని బుర్రనిండా ఆలోచనల్ని కల్పించి, తీరని కోరికల్ని రేకెత్తించాయి. ఇప్పుడీ సినిమా హీరోయిన్ వంపులు గంటన్నర చూసి, ఇంటికెళ్ళినపుడతడు తిరిగి ఇంకో రంగురంగుల ఊహాలోకంలో ప్రవేశించవచ్చు, తీరని కోరికల్ని తృప్తిపరచుకుందుకు.........